పల్లె వైపు చూడని ఆర్టీసీ బస్సు

- గ్రామాలకు పల్లెవెలుగు సర్వీసులన్నీ రద్దు
- జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- బస్సులు నడపాలని రవాణా శాఖ మంత్రిని కోరిన మాజీ మంత్రి జానారెడ్డి


బస్సుల సమస్యను మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వివరిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి

నిడమనూరు : మండలంలో వివిధ గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి కనీసం మండల కేంద్రానికి వెళ్లడానికి కూడా ఆర్టీసీ బస్సులు లేకుండా పోయాయి. మండలంలో గ్రామాలన్ని మండల కేంద్రానికి దూరంగా ఉంటాయి. దూరప్రాంతాల నుంచి మండల కేంద్రానికి వివిధ పనులపై రావాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా ఆటోలు నడుస్తున్న వాటిలో ప్రయాణించడం కొంత భారంగా ఉంటుంది.

జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే..

నిడమనూరు నుంచి ముప్పారం, ఊట్కూర్, ఎర్రబెల్లి, మారుపాక ద్వారా నల్లగొండ బస్ సర్వీసు మూడేళ్ల కిందట నిలిచిపోయింది. అదే విధంగా నిడమనూరు, వేంపాడ్, గుంటిపల్లి, ఎర్రబెల్లి, ముషంపల్లి బస్సు సర్వీస్ సైతంనిలిపి వేశారు. మండల కేంద్రం నుంచి పార్వతీపురం, రాజన్నగూడెం, మార్లగడ్డ తండా వరకు నడిచే బస్సు సైతం దశాబ్దం కిందటే నిలిచిపోయింది. మండల కేంద్రం నుంచి బంకాపురం, వెనిగండ్ల, బస్సు, మండలంలోని సూరేపల్లి-హాలియా బస్సు సర్వీసు సైతం మరిచిపోయారు. అన్ని రూట్లలో మళ్లీ ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. నిడమనూరు నుంచి నల్లగొండకు ప్రత్యేక బస్సులను పెంచాలని స్థానికులు ఎప్పటి నుంచో అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. నిడమనూరు మండల వాసులు జిల్లా కేంద్రమైన నల్లగొండకు వెళ్లాలంటే రెండు బస్సులు మారాల్సి వస్తుంది. జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే మండల కేంద్రం నుంచి 4కిలోమీటర్ల దూరంలోని 14వ మైలు వద్దకు వెళ్లి అక్కడి నుంచి మరో వాహనంలో నల్ల గొండకు వెళ్లాల్సి వస్తుంది. నిడమనూరుకు తిరిగి రావాలన్నా అక్కడ దిగి మరో వాహనాన్ని ఆశ్రయించాల్సిందే.

రవాణా శాఖ మంత్రికి విన్నవించిన జానారెడ్డి

నియోజకవర్గంలోని వివిధ రూట్లలో బస్సు సర్వీసులను పునుద్ధరించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి మాజీ మంత్రి, మాజీ సీఎల్‌పీ నేత కుందూరు జానారెడ్డి శనివారం వివరించారు. ప్రజల నుంచి ఆయనకు వచ్చిన వినతుల మేరకు ప్రధానరూట్లతో పాటు నిలిపివేసిన పల్లె వెలుగు బస్సులు తిరిగి నడపాలని కోరారు. సాధ్యాసాధ్యాలను పరిశీ లించి ప్రజలకు ఇబ్బంది లేకుండా బస్సు సర్వీసులను పునరుద్ధరించడానికి అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని మంత్రి పొన్నం ప్రభాకర్, జానారెడ్డికి వివరించారు.

బస్ సర్వీసులను పునరుద్ధరించాలి



గ్రామాల నుంచి మండలకేంద్రానికి, జిల్లా కేంద్రానికి వెళ్లే బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి. ఆర్టీసీ బస్ రూట్లలో నడపక పోవడంతో జిల్లా కేంద్రానికి వెళ్లాలన్న వ్యయ ప్రయాసాలకు గురికావాల్సి వస్తుంది. ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బస్సులు నడపాలి. విద్యార్థులు, ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించాలి.

– నందికొండ సైదయ్య, మాజీ ఉప సర్పంచ్, మారుపాక

పేదలకు కల్యాణలక్ష్మి పథకం వరం


కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

చింతపల్లి : కల్యాణ లక్ష్మి పేదలకు వరంలాంటిదని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రం ఆధ్వర్యంలో కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను విడతల వారిగా పూర్తి చేస్తారని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద త్వరలో రూ.500లకే గ్యాస్, 200యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండూరు భవాని పవన్‌కుమార్,. తహసీల్దార్ శంషొద్దీన్, ఎంపీడీఓ సుజాత, డిప్యూటీ తహసీల్దార్ అర్షద్, ఆర్ఐ. యాదయ్య, నాయకులు సంజీవరెడ్డి, ముచ్చర్ల యాదగిరి, కాయితీ జితేందర్‌యాదవ్, వెంకటయ్యగౌడ్, లింగంపల్లి వెంకటయ్య, సలీమ్ పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గౌరవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఐ రాఘవరావు

హాలియా : విద్య ద్వారనే సమాజంలో ఉన్నతమైన గుర్తింపు లభిస్తుందని సీఐ రాఘవరావు, ఎస్ఐ సతీష్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కృష్ణవేణి స్కూల్‌లోని తొమ్మిదో తరగతి విద్యార్థులు పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు పేరుతేవాలని కోరారు. ప్రణాళికాబద్ధంగా చదివితేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దని చెప్పారు. కృష్ణవేణి స్కూల్ చైర్మన్ నిమ్మల లక్ష్మారెడ్డి, మాట్లాడుతూ వందశాతం ఉత్తీర్ణ సాధిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యువతలో దేశభక్తిని పెంపొందించాలి



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రామచంద్రమిషన్ సభ్యులు

నాగార్జునసాగర్ : యువతలో దేశభక్తిని పెంపొందించాలని, అప్పుడే స్వామి వివేకానందుడు కన్న కలలు ఆవిష్కృతమవుతాయని రామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ జోనల్ కోఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి తెలిపారు. రెండు రోజులుగా స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పలు రకాల ఇండోర్, ఔట్ డోర్ క్రీడా పోటీలను నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, జావలిన్ త్రో, లాంగ్‌జంప్, టేబుల్‌టెన్నీస్, చెస్, క్యారమ్స్ తదితర క్రీడా పోటీల్లో గెలుపొందిన యువతకు బహుమతులు అందజేసే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెన్‌కో సూపరింటెండెంట్ రఘురాం, పాత్రికేయులు కెవీల బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యోగా, ధ్యానంతో శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్యేంద్రప్రకాశ్, అహల్య, చిరంజీ, వి,డేనియల్‌రాజు, అవిన్, ప్రసన్న, సత్యనారాయణ, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఐక్యతను దెబ్బతీసేందుకు కుట్ర

మిర్యాలగూడ : సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో గిరిజన జాతిని కించపరిచే విధంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వ్యవహరిస్తున్నారని బంజారా సేవా సంఘం నాయకులు చిట్టిబాబునాయక్, రవినాయక్, హాతీరాంనాయక్‌లు ఆరోపించారు. శనివారం వారు పట్టణంలో మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఏకపక్షంగా నిర్వహించారన్నారు. గిరిజన ప్రజాప్రతినిధులను ఆహ్వానించకుండా అవమానపరిచారని ఆరోపించారు. సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను రెట్టింపు విడుదల చేయడంతో సంతోషిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా వేడుకలు జరపాల్సి ఉండగా అలా చేయకపోవడం దారుణమన్నారు. గిరిజనులపై నిర్లక్ష్యం వహిస్తే గిరి జనులే తగిన బుద్ధిచెప్తారని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో శ్రీనునాయక్, వీరా నాయక్, సురేష్‌నాయక్, సచిన్, రాంసింగ్ నాయక్, సైదా నాయక్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మండల వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొంపల్లి గ్రామంలో రూ.20లక్షల వ్యవయంతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కాంసాని చంద్రశేఖర్ యాదవ్, నాయకులు నెమలి శ్రీధర్‌రెడ్డి, గాలి చంద్రకళ, ప్రవీణ్, శ్రీని వాస్‌రెడ్డి, యాదయ్య, సైదయ్య, సజ్జన్ పాల్గొన్నారు.


హెలికాప్టర్‌లో దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు వస్తున్న డిప్యూటీ సీఎం, మంత్రులు


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ చందనాదీప్తి


డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్, మిర్యాలగూడ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు


హెలికాప్టర్ నుంచి అభివాదం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్

కనుల పండువగా తిరుమలనాథుడి కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు


ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న పాండురంగారెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : తిరుమలగిరి మండల పరిధిలోని శ్రీ తిరుమలనాథస్వామిగుట్ట అశేష భక్త జనంతో కిక్కిరిసిపోయింది. ప్రతి ఏటా నాగశుద్ధ పౌర్ణమి రోజున నిర్వహించే స్వామి వారి కల్యాణం శనివారం కనుల పండుగగా సాగింది. మొదటగా స్వామి, అమ్మవార్లను 2500 అడుగుల ఎత్తుగల తిరుమలనాథుడి కొండ నుంచి కింద ఉన్న కల్యాణ మండపం వద్దకు ప్రత్యేక పల్లకిలో తీసుకువచ్చారు. వేద పండితులు రాయపోలు మురళీకృష్ణశర్మ అర్చక బృందం వేద మంత్రోచ్ఛరణ నడుమ కల్యాణతంతు నిర్వహించారు. ప్రభుత్వం తరుపున స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాలతలంబ్రాలు, పుస్తెమెట్టలను ఆలయ కార్యనిర్వాహకులు సమర్పించారు. ఈ కల్యాణాకి తిరుమలగిరి, అనుముల, పెద్దవూర, నిడమనూర్, పీఏపల్లి తదితర మండలాల నుంచి ఆటోలు, ట్రాక్టర్లు, కార్లు, కమైండర్ల ద్వారా సుమారు 20వేల మంది జాతరలో పాల్గొన్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ బీసన్న, ఎస్ నారయణరెడ్డి పటిష్ట చర్యలు చేపట్టారు.

నాయకుల ప్రత్యేక పూజలు

కల్యాణంలో బుసిరెడ్డి పౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి, ఎంపీపీ ఆంగోతు భగవన్ నాయక్ తదితర నాయకులు పాల్గొని స్వామి అమ్మవార్లుకు ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, వెంపటి శ్రీనివాస్, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎద్దుల పోటీలకు పెరిగిన ఆదరణ

ప్రస్తుతం ఎద్దుల పోటీలకు జన ఆదరణ పెరిగిందని, పోటీలు నిర్వహిస్తే చాలు అక్కడికి నలుమూలల నుంచి జనాలు వస్తున్నారని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి అన్నారు. శ్రీ అలివేలుమంగమ్మ సమేత శ్రీతిరుమలనాథ స్వామి కల్యాణ మహోత్సవం సందరర్భంగా నిర్వహించిన జాతీయస్థాయి ఒంగోలు జాతీ పెద్ద సైజు ఎడ్ల పోటీలను ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బుర్రి రాంరెడ్డి, వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి, నాయకులు శ్రవణ్‌కుమార్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్, సురేష్, శ్రీను, పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు


డిండి : అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

డిండి : బాల్య వివాహాలు నిర్వహిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని దేవరకొండ సీడీపీఓ ఖాతీజాభేగం అన్నారు. శనివారం మండల పరిధిలోని దేవత్‌పల్లితండాల్లో బాల్య వివాహం జరుగుతుందని 1098 హెల్ప్ లైన్ నంబర్‌కు ఫోన్ రావడంతో అక్కడికి చేరుకున్న ఐసీడీఎస్ అధికారులు పరిశీలించి నూతన వధువరులు మేజర్‌గా ఉన్నారని తెలిసింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు పలువురు తల్లిదండ్రులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుకారెడ్డి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు ఉన్నత చదువులు చదవాలి

మిర్యాలగూడ టౌన్ : అడపిల్లలు ఉన్నత చదువులు చదవాలని మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ మమత అన్నారు. శనివారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'బేటీ బచావో-బేటీ పడావో' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అమ్మాయిలకు ఏదైనా ఆపద వచ్చినప్పుడు 100, 1098, 181కి గాని ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వి. జ్యోతి, పాఠశాల టీచరు ఇందిరా, అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మి, జయలక్ష్మి, సత్యలక్ష్మి, నాగుర్బీలతో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ

- వ్యక్తిపై కేసు నమోదు

మిర్యాలగూడ టౌన్ : గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసిన వ్యక్తిపై శనివారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రూరల్ ఎస్ఐ సతీష్ వర్మ వివరాల ప్రకారం .. మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామానికి చెందిన తుర్క పెద్దిరాజు అనే వ్యక్తి పట్టణంలోని ఈదులగూడెం వద్ద నివాసం ఉంటున్న జెల్లి పుష్పకు అవంతిపురం గ్రామ పంచాయితీ పరిధిలోని 3.22/1 ఇంటి ఖాళీ స్థలం అమ్మి ఆ స్థలానికి చెందిన పత్రాలను అందించాడు. దీంతో పుష్ప మిర్యాలగూడలోని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చి అక్కడ ఆ కాగితాలను రిజిస్ట్రేషన్ కోసం చూపించగా ఆ భూమిపై మరో పేరు వస్తుందని తెలిపి, మీరు పంచాతీ కార్యదర్శి వద్దకు వెళ్లి అడగమని చెప్పారు. దీంతో ఆమె ఈనెల 21వ తేదీన పంచాయతీ కార్యదర్శి సోమిడి గాయత్రి వద్దకు వెళ్లింది. దీంతో క్యాదర్శి ఆ పత్రాలను పరిశీలించి ఈ సంతకం తనది కాదని వెంటనే రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే ఫోర్జరి చేసిన పెద్దిరాజుపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గణితం, సైన్స్ సబ్జెక్టులకు సంబంధించి పీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా పీపీఆర్ ఫౌండేషన్ చైర్మన్ చలం పాండురంగారావు మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుల్లో రాణించేందుకు తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేఖారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వరరెడ్డి, మంగ్యనాయక్, వల్ల ఆంజనేయులు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నోటుబుక్స్,పెన్నులు పంపిణీ

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని కల్లెపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోటుబుక్స్, పెన్నులును బంజారా మహిళ ఎన్‌జీఓ నిర్వాహకులు డాక్టర్ ఆనంద్, హరిప్రియలు సంయుక్తంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆనంద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఐదేళ్లుగా తాను పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుజాత, ఉపాధ్యాయులు చిన గోపాల్, గోవింద్ పాల్గొన్నారు.

బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్

పెద్దఅడిశర్లపల్లి : గుడిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మహాలక్ష్మి మహిళామండలి ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభుదాసు, వెంకటమ్మ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మిర్యాలగూడ టౌన్ : రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం రాత్రి ఒక వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని వెంకట్రాది పాలెం గ్రామానికి చెందిన మధు 16 రోజుల క్రితం తన వాహనంలో బియ్యం తీసుకెళ్తుండగా రూరల్ పోలీసులకు అనుమానం వచ్చి ఆ వాహనాన్ని తనిఖీ చేసి పీడీఎస్ బియ్యం అనుకొని బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఆ బియ్యం పీడీఎస్ బియ్యం కావని సివిల్ సప్లయ్ అధికారులు తెల్పడంతో తన వాహనాన్ని ఇవ్వాలని శనివారం తన మామతో కలిసి పోలీస్ స్టేషన్ వచ్చి ఎస్ఐని కోరగా సోమవారం రమ్మని చెప్పాడు. అవి పీడీఎస్ బియ్యం కావాని తెలిసినప్పటికీ తన బండి విడిచిపెట్టకుండా 16రోజులుగా స్టేషన్‌లో పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకోని ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో అక్కడున్న పోలీసులు అడ్డుకున్నారు. ఈ విషయంపై రూరల్ ఎస్ఐ సతీశ్ వర్మ మాట్లాడుతూ వెంకటాద్రి పాలెం సమీపంలో వాహనాల తనిఖీలో బియ్యం పట్టుకొని స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆధారాలు తీసుకురావాలని కోరడంతో పాటు సివిల్ సప్లయ్ వారు పరిశీలించిన తరువాత ఇస్తామని చెప్పగా శనివారం రోజు వచ్చి తన వాహనాన్ని ఇవ్వాలని కోరితే సోమవారం రమ్మని చెప్పామని తెలిపారు.

పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం

ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా వ్యవహరించి అందరిని ఆకట్టుకున్నారు. ప్రతిభకనబర్చిన విద్యార్థులు బహుమతులు అందజేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



పెద్దవూర : జెడ్పీ హెచ్ఎస్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు


అడవిదేవులపల్లి : మొల్కచర్ల ప్రాథమికోన్నత పాఠశాలలో..


హాలియా : అనుముల ప్రాథమిక పాఠశాలలో 'స్వపరిపాలన దినోత్సవం


మిర్యాలగూడ : దామరచర్ల ప్రాథమిక పాఠశాలలో..


దిండి : ప్రాథమిక పాఠశాలలో..


పెద్దవూర : ప్రాథమిక పాఠశాలలో..


దేవరకొండ : సంజయ్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో..

క్లుప్తంగా

డిప్యూటీ సీఎంకు వినతి


డిప్యూటీ సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న తుమ్మల వీరారెడ్డి, జూలకంటి రంగారెడ్డి

నల్లగొండటౌన్: ఎలక్ట్రిసిటీ స్టోర్ హమాలీలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఆదివారం దామరచర్లకు వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు సీఐటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 220 మంది ఎలక్ట్రిసిటీ స్టోర్ కార్మికులు రెగ్యులరైజ్ చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం నాయకులు జూలకంటి రంగారెడ్డి, యాదయ్య, శ్రీనివాస్, శంకర్, యాదగిరిరెడ్డి ఉన్నారు.

రూ. 2లక్షల రుణమాఫీ చేయాలి

నిడమనూరు : రైతులకు రూ.2లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను శనివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రుణమాఫీ చేస్తాం అంటూనే కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు రుణమాఫీ ఎంతో పయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కోమండ్ల గుర్వయ్య, శేఖర్, చరణ్‌రాజు, కేశవులు ఉన్నారు.

షేక్ వహీద్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

హాలియా : పట్టణానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, స్థానిక అక్షయ హైస్కూల్ కరస్పాండెంట్ షేక్ వహీద్(58) అనారోగ్య కారణంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడు షేక్ వహీద్ మృతదేహంపై ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ఆయన తన ప్రగాఢ సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో అనుముల ఎంపీపీ పేర్ల సుమతిపురుషోత్తం, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ మున్నా, బీఆర్ఎస్ ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యక్షుడిగా నేనావత్ మల్లేశ్‌నాయక్



దేవరకొండ : బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దేవరకొండ మండల పరిధిలోని గిరిజనగర్ తండాకు చెందిన నేనావత్ మల్లేశ్‌నాయక్ నియామకమయ్యారు. ఈ మేరకు గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్ శనివారం నియామక పత్రం అందజేసినట్లు మల్లేశ్‌నాయక్ తెలిపారు. రానున్న రోజుల్లో గిరిజన అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారం

పెద్దఅడిశర్లపల్లి : జిల్లాలో రెండో తిరుపతిగా పేరుగాంచిన గుడిపల్లి మండలం కోదండాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ పాలక మండలి శనివారందేవాలయ శాఖ ఈఓ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ చైర్మన్‌గా గ్రామానికి చెందిన గజ్జల వెంకటేశ్వర్‌రెడ్డి, సభ్యులుగా పోశంరెడ్డి సైదిరెడ్డి, పోలే ఇందిరా మహేందర్, బొడ్డుపల్లి వెంకటరమణాచారి, నక్క భిక్షమయ్య, ఇంద్రకంటి లక్ష్మయ్య, బాబోయిన వెంకటయ్యలు ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం అనంతరం ఎన్నికైన సభ్యులను సన్మానించారు.

27న మున్సిపల్ బడ్జెట్ సమావేశం

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 27న మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అధ్యక్షతన బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి గౌరవ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ ఎంసి కోటిరెడ్డిలు హజరు అవుతారన్నారు. కౌన్సిలర్లు సకాలంలో హాజరుకావాలన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

మిర్యాలగూడ టౌన్ : జాతీయ స్థాయి బాల్ జూనియర్ బాడ్మింటన్ పోటీలకు మిర్యాలగూడ ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థిని భవ్యశ్రీ ఎంపికైంది. భవ్యశ్రీ ఈనెల 10, 11వ తేదిలలో హైదరాబాద్‌లోని మారుతీ గ్రాండ్ ఎఎస్‌రావులో తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈపోటీలను బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో మార్చి 10తేదీ నుంచి 14 వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు కవితతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.